క్లుప్తంగా

బుద్ధుడి బోధనలు నేటి తరానికి అవసరం

కడప కల్చరల్ : గౌతమ బుద్ధుడి మార్గాలే నేటి సామాజిక వికాసానికి పునాదులవుతాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక స్పిరిట్స్ కళాశాలలో బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ కడపశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బౌద్ధ ధర్మం–నేటి ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజ వికాసం పొందడానికి విద్యార్థులు బుద్ధుని పంచ సూత్రాలు, అష్టాంగ మార్గాలు తెలుసుకుని మన జీవన విధానంలో వాటిని అమలు చేయాలన్నారు. బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం అతిథులు వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. బి.ప్రసాద్ ప్రథమ, పూజిత ద్వితీయ, తృతీయ బహుమతి దివ్య సాధించారు. మరో ఏడుగురిని ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేస్తాం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం కడపలోని సిఎస్‌ఐ స్కూల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇక్బాల్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సివిప్రసాద్, రూట జిల్లా అధ్యక్షులు షేక్ మహమ్మద్ ఇర్షాద్, ముజాహిద్, గురువయ్య పాల్గొన్నారు.

7న నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 7న స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద నిరసన చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఓబులేసు, ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట సచివాలయ పరిధిలోని బోడెద్దులపల్లె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం స్వాధీనం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేసి జగనన్న కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ దశలవారీ పోరాటాలు చేపడతామన్నారు. ఈ నెల 17 నుంచి 30 వరకు సంతకాల సేకరణ, ఫిబ్రవరి 6న జిల్లా స్థాయి సదస్సు, 22న రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరశేఖర్, ఓబయ్య, సావంత్ సుధాకర్, బాలు, వలరాజు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

కడప అర్బన్: కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గోకుల్ సర్కిల్ సమీపంలో మట్కా రాస్తున్న షఫీవుల్లాఖాన్, రఖీబ్, మరొకరు మొత్తం ముగ్గురిని సీఐ ఎన్వీ నాగరాజు, ఎస్‌ఐ సిద్దయ్య తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 26,300 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు.

ఏడుగురిపై వరకట్న వేధింపుల కేసు

కడప అర్బన్: నగరంలోని రాజారెడ్డివీధిలో నివాస ముంటున్న ప్రశాంతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త విజయభాస్కర్, బంధువులతో కలిపి మొత్తం ఏడుగురిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్వీ నాగరాజు తెలిపారు. ప్రశాంతి, విజయభాస్కర్‌లకు 2018లో వివాహమైందని, విజయభాస్కర్ రాయచోటి కోర్టులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. విజయభాస్కర్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు కుటుంబ సభ్యులతోకలిసి వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ప్రతి గడపకు సంతృప్త స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. మంగళవారం నగరంలోని 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున ఆధ్వర్యంలో చిన్నచౌకు, భాగ్యనగర్ కాలనీతోపాటు పలు వీధుల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అంజద్‌బాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయనకు ప్రజలు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ఆయన నేరుగా మాట్లాడారు. పథకాల లబ్ధి సమాచారంతో సీఎం సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా, మరి కొందరు తమ సమస్యలను అంజద్‌బాష దృష్టికి తీసుకు వచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఆ డివిజన్‌లో వృద్ధులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్జల్‌ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, టీవీ సుబ్బమ్మ, పసుపులేటి రాజేశ్వరి, నారాయణమ్మ, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, కో ఆప్షన్ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష


వీఎన్‌పల్లె : ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.పాలగిరి సచివాలయ పరిధి లోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, మద్రిపల్లె, గోనుమాకులపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై ప్రజలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు, సిమెంటు రోడ్లు, భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నరేన్ రామాంజులరెడ్డి, రాష్ట్ర మైనింగ్, సివిల్ సప్లై డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నాయకులు వీరయ్యయాదవ్, విజయ్‌కుమార్ యాదవ్, రాజమ్మ, శంకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, సురేంద్రకుమార్ యాదవ్, పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. వీరపునాయునిపల్లె మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పింఛన్ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల కష్టాల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. వయస్సులో చిన్నవాడైనా దూరదృష్టితో ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడేనన్నారు. నవరత్నాల పథకాల వలన ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. మీ అందరి ఆశీర్వాదం జగన్‌మోహన్‌రెడ్డికి కావాలని ఆయన కోరారు.

వైభవంగా ఊంజల్ సేవ

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ నడివీధి గంగమ్మ క్షేత్రంలో మంగళవారం శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాలు అందజేసిన ఉత్సవ మూర్తుల ఊంజల్ సేవ కోసం ప్రత్యేక వేదిక ను నేత్ర పర్వంగా పూలతో అలంకరించారు.

పింఛన్ పంపిణీ


పింఛన్ సొమ్ము అందజేస్తున్న జరుగు రాజశేఖర్

కడప కార్పొరేషన్ : అవ్వాతాతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, రాజా జ్యువెలర్స్ అధినేత జరుగు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక 1వ డివిజన్‌లో మంగళవారం ఆయన కార్పొరేటర్ ఆర్.చెన్నయ్యతో కలిసి 38 మందికి కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ పింఛన్‌ను రూ. 2750కు పెంచడంతోపాటు కొత్త పింఛన్లను కూడా మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

ప్రాణికోటికి సేవలందించడమే ధర్మమార్గం


ప్రవచనం, పూజలు చేస్తున్న రాళ్లబండి రాఘవన్


శ్రీలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీనివాసునికి ధనుర్మాస పూజలు

కడప కల్చరల్ : సర్వప్రాణికోటికి సేవలు అందించడమే ధర్మమార్గమని ప్రముఖ ప్రవచకులు రాళ్లబండి రాఘవన్ తెలిపారు. మంగళవారం ధనుర్మాస పూజల్లో భాగంగా తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక బీకేఎం వీధిలోగల శ్రీ కోదండ రామాలయంలో ఆయన తిరుప్పావై ప్రవచనాలు చేశారు. మనిషిలోని ఈర్ష ద్వేషాలు తొలగి, ఉత్తమ గుణాలను పెంచి సర్వమానవాళికి సేవలు అందించడమే ఉత్తమ ధర్మమార్గంలో తిరుప్పావై పాశురాలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 19వ తిరుప్పావై పాశురం ప్రశస్తి గురించి ఆయన ప్రబోధిస్తూ లోక క్షేమం కోసం చేస్తున్న తిరుప్పావై వ్రతాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు, శ్రీ లక్ష్మినారాయణస్వామి పూజలు నిర్వహించారు. పుష్పార్చన, కుంకుమార్చనలతో దేవతామూర్తులకు పూజలు చేశారు.

రాహుకాల పూజలు



కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

– డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప అగ్రికల్చర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కడప మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి అధ్యక్షతన మొదటి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా హాజరై మాట్లాడారు. కడప యార్కెట్ యార్డు ఎంతో పురాతనమైనదని ఇది జిల్లాకే తలమానికం అన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన పంటలను యార్డులో విక్రయించేందుకు వస్తారని వారికి కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలన్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డు అభివృద్ధికి అధికారులతోపాటు పాలకవర్గం సమన్వయంతో కృషి చేసి అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. మార్కెట్‌యార్డుకు ఆదాయ వనరులను పెంచాలన్నారు. రైతులకు, వ్యాపారులకు ఏమి అవసరమో గుర్తించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఇందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, అలాగే ప్రభుత్వం నుంచి సహకారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌యార్డులో నిలిచిపోయిన షెడ్డు నిర్మాణ పనులను కూడా ఎంపీ అవినాష్ రెడ్డితో చర్చించి పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం కడప మార్కెట్ యార్డులో రూ. 450 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి కమిటి సభ్యులు తీర్మాణం చేశారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి, వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, డైరెక్టర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్లు బంగారు నాగయ్య, రామక్రిష్ణ, అతావుల్లా, తులసి, జమయ్య, అమ్మణ్మి, సంపత్‌కుమార్, జయశ్రీ, రామలక్షుమ్మ, మార్కెట్ కమిటి ఏడీ ఆజాద్, సెక్రటరీ బాలవెంకట రెడ్డి, కార్పోరేటర్ షఫీ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తారు..

మార్కెట్‌యార్డులో మంచినీటి సౌకర్యార్థం చైర్మన్ బంగారు గంగాదేవి, డైరెక్టర్ బంగారు నాగయ్యలు తమ సొంత నిధులతో వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేస్తారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా పేర్కొన్నారు. అందుకు వాళ్లు సమ్మతించడంతో అందరూ అభినందించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మంగళవారం సావిత్రీబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి, రిజిస్టార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలో మహిళలకు విద్య అవకాశాల కోసం పోరాడిన గొప్ప సంస్కర్త సావిత్రీబాయిపూలే అన్నారు. రిజిస్టార్ మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం తీసుకువచ్చిన సంఘ సంస్కర్త పూలే అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైవీయూ: మహిళల విద్యా అవసరాన్ని గుర్తించి పాఠశాలలను నెలకొల్పి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన సావిత్రీబాయిపూలే నిత్యస్మరణీయులని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి పేర్కొన్నారు. తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు వైవీయూ టీచర్స్ అసోసియేషన్ (యూటా) ఆధ్వర్యంలో పరిపాలనభవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ప్రతికూల వాతావరణానికి తట్టుకుని బాలికలకు విద్య అందించడమే ధ్యేయంగా కదిలిన ఆమె స్ఫూర్తి నేటితరానికి ఆదర్శమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అందుకు కారణం సావిత్రీబాయిపూలే ఆరోజు చేసిన ప్రయత్నమేనన్నారు. ఆచార్య ఏజీ దాము, ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై. సుబ్బరాయుడు, ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, యూటా అధ్యక్షుడు డా. కె.ఎస్.వి. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి డా. సుభోష్‌చంద్ర సావిత్రీబాయి పూలే సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. టి. చంద్రశేఖర్, డా. ఆదినారాయణ, డా. విజయ్‌కుమార్ నాయుడు, డా. పి.సరిత, డా. మునికుమారి, డా. ప్రమీల మార్గరేట్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు


మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గోవిందు నాగరాజు తదితరులు


ఆర్ట్స్ కళాశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కడప రూరల్: దీన జన బాంధవి సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల లెక్చరర్ జానపాటి వెంకటలక్ష్మి, ఉపాధ్యాయురాలు వీ విజయలక్ష్మి, పద్మజలను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్, నాయకులు కొప్పుల శివయాదవ్, షిండే రవిచంద్ర, గువ్వల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్.. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డా. యు. రమ్యజ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డా. వై. సావిత్రి, డా. శివరామకృష్ణ, అధ్యాపకులు రాజేశ్వరి, రవిశేఖర్, శాంతిలత, వెంకటలక్ష్మి, కల్పన, శ్రీనీత, రేఖ, పర్వీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మిదేవి, డా. పి. శచీదేవి సావిత్రీబాయిపూలే చేసిన సేవలను కొనియాడారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నేటి మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు బషీరున్నీషా, భాగ్యలక్ష్మీ, వీరాంజనేయులు, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌మార్గ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి


డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన రాజీవ్‌మార్గ్ రోడ్డు పనులను తనిఖీ చేశారు. పార్ట్ వే, యోగా కోసం ఏర్పాటు చేసిన స్థలం, లైటింగ్ పోల్స్ వెంటనే సిద్ధం చేయాలన్నారు. పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి టాయిలెట్లు సిద్ధం చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేసి లైట్లు అమర్చాలన్నారు. డ్రైయిన్ శ్లాబ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు.

మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 3, 14 డివిజన్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేయడం వల్ల కలిగే ఇబ్బందులు గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు చెత్త సేకరణ చేపట్టాలని, క్లాప్ ఆటోలు వారికి కేటాయించిన డివిజన్లలో రోజుకు మూడు సార్లు చెత్త స్వీకరించాలన్నారు. విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.